

అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో ప్రసంగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

జాతీయ ఆర్థిక వ్యవస్థ రూపకల్పనలో

రాష్ట్రానిదే కీలక పాత్ర

● పెట్టుబడిదారుల సదస్సులో సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆర్థికవ్యవస్థ రూపకల్పనలో రాష్ట్రం కీలక పాత్రను పోషిస్తున్నదని, కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్న దేశవిదేశాలకు చెందిన కంపెనీలకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సును ఆయన ప్రారంభించారు. కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులు, ప్రముఖులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో స్టాలిన్ మాట్లాడుతూ... విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందువల్లే రాష్ట్రంలో నిష్ణాతులైన కార్మికులు, నిపుణులకు కొదవ లేదన్నారు. సాధారణంగా విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడే సూటు వేసుకోవడం తనకు అలవాటని, అయితే ఈ సదస్సుకు విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, రాయబారులు, వాణిజ్యవేత్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సూటు వేసుకుని హాజరయ్యానని సభికుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో చల్లటి వాతావరణంలో సదస్సు ప్రారంభం కావడంతో సంతోషంగా ఉందని, బయట వర్షం, లోపల పెట్టుబడుల వర్షం కురుస్తోందని చమత్కరించారు. సదస్సు హాజరైనవారందరినీ తాను సీఎంగా కాకుండా ఆత్మీయ సోదరుడనే భావనతోనే ఆహ్వానిస్తున్నానని చెప్పారు.

విదేశాలతో వాణిజ్య సంబంధాలు...

ప్రాచీన కాలంలోనే తమిళులు విదేశాలతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉండేవారని, కనుకనే సముద్రాలు దాటైనా ధనం సంపాదించు అనే సామెత పుట్టుకొచ్చిందని సీఎం అన్నారు. రాష్ట్రంలో అత్యుత్తమ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికి దోహదం చేసే పారిశ్రామికవేత్తలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. దశాబ్దాల తరబడి రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పుతున్నారని, ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సులో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, వాణిజ్య శాఖల్లో అనుభవం కలిగిన వ్యక్తి పీయూష్‌గోయల్ అని, ఈ సదస్సులో ఆయన పాల్గొనటం సముచితంగా ఉందన్నారు. ఈ సదస్సును అంతర్జాతీయ స్థాయి ఏర్పాట్ల నడుమ ఏర్పాటు చేసిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్ సహా వివిధ శాఖలకు చెందిన అధికారులందరినీ అభినందిస్తున్నానని చెప్పారు. అమెరికా, బ్రిటన్, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జర్మనీ, డెన్‌మార్క్ దేశాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. రెండేళ్లుగా రాష్ట్రం ఆర్థిక పురోగమన దిశగా పయనిస్తోందని, అదనపు పెట్టుబడుల సమీకరణ వల్ల మరింత ఆర్థిక ప్రగతిని సాధించనుందని చెప్పారు. సమర్థవంతమైన నాయకత్వం, సుస్థిరత్వం, అంతర్గత అభివృద్ధి అనే ప్రాతిపదికలపైనే ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. 2030లోపున రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల మేరకు ఆర్థిక ప్రగతిని సాధించిన రాష్ట్రంగా తీర్చిదిద్దటమే తన ఆశయమన్నారు. వాణిజ్య అవసరాలకు అనువుగా అనుభవం, సామర్థ్యం కలిగిన నిపుణులను అందుబాటులో ఉంచామన్నారు. ఆయా పరిశ్రమలకు అనువైన విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దే పథకాలు అమలు చేస్తున్నామని, నాన్ ముదల్వన్ పథకం ద్వారా విద్యార్థులకు ప్రతిభాపాటవాలను పెంచే శిక్షణను అందిస్తున్నామని స్టాలిన్ వివరించారు. విద్యలో, ఉపాధి అవకాశాల కల్పనలో, మహిళాభ్యుదయంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు.

అన్ని జిల్లాలకు సమాన అవకాశాలు...

కొత్త పరిశ్రమల స్థాపనలో, పారిశ్రామిక పథకాల అమలులో అన్ని జిల్లాలకు సమాన అవకాశాలు కల్పిస్తున్నామని, ఆయా జిల్లాల్లో లభిస్తున్న వనరులకు తగినట్లు పరిశ్రమలు స్థాపిస్తున్నామని సీఎం చెప్పారు. అన్ని జిల్లాల్లోనూ యువశక్తిని పెంపొందిస్తున్నామని, యువతీయువకులకు ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. హ్యుందాయ్, టాటా సహా ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలను విస్తరింపజేయడం వల్ల విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయని చెప్పటం అతిశయోక్తి కాదన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తమ రాష్ట్రం పేరుతెచ్చుకుందని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

అవగాహన ఒప్పందాలు...

ఈ సదస్సులో సీఎం స్టాలిన్, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, రాష్ట్ర మంత్రి టీఆర్‌బీ రాజా సమక్షంలో సుప్రసిద్ధ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. టాటా ఎలక్ట్రానిక్స్, పెకట్రాన్, టీవీఎస్ గ్రూపు, మిత్సుబిషి, ఏబీ మోలార్ మెరెస్క్, హ్యుందాయ్, జేఎస్‌డబ్ల్యూ, అశోక్‌లేలాండ్, విన్‌ఫాస్ట్ కంపెనీలు కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు, విస్తరణ కార్యక్రమాలు చేపట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఆ తర్వాత రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ విధానం 2024, వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థికాభివృద్ధిని సాధించేలా కార్యాచరణ పథకం పేరుతో రెండు విధానాలను స్టాలిన్ విడుదల చేశారు. క్వాల్‌కామ్ డిజైన్‌సెంటర్ అండ్ ఫస్ట్ సోలాలర్ సంస్థల పథకాలను ప్రారంభించి, గోద్రెజ్ కంపెనీ పథకానికి శంకుస్థాపన చేశారు.

హాజరైన అతిరథులు...

ఈ సదస్సు దేశవిదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. జపాన్‌లోని కోషి ప్రావిన్స్ గవర్నర్ హమాటా సెయ్‌జీ, భారత పారిశ్రామిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ఆర్.దినేష్, ఓలా ఎలక్ట్రిక్ సంస్థ వ్యవస్థాపకుడు భవిష్ అగర్వాల్, గోద్రెజ్ సంస్థ అధ్యక్షురాలు నిసబా గోద్రెజ్, టీవీఎస్ గ్రూపు ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ తదితరులు ప్రసంగించారు. రిలయెన్స్ సంస్థ ఛైర్మన్ ముఖేష్ అంబానీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా వందన సమర్పణ చేశారు. ఈ సదస్సులో రాష్ట్ర మంత్రులు దురైమురుగన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్, రాష్ట్ర మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు. కాగా 100కు పైగా సంస్థల ఒప్పందాలతో 5.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు ప్రభుత్వం పేర్కొంది.





సదస్సులో రూ.5600 కోట్ల పెట్టుబడితో కాంచీపురం జిల్లా సిప్కాట్‌లో నెలకొల్పనున్న ఫస్ట్‌సోలార్ కంపెనీని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ - రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థికాభివృద్ధి సాధన దిశగా కార్యాచరణ నివేదికను వెలువరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రధాని మోదీ హృదయంలో తమిళనాడుకు ప్రత్యేకస్థానం

● కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ హృదయంలో తమిళనాడుకు ప్రత్యేక స్థానం ఉందని, ఈ రాష్ట్రంలోని సంస్కృతీ సంప్రదాయాలన్నా, ప్రజలన్నా ఆయనకు ఇష్టమని కేంద్ర వాణిజ్య , పారిశ్రామిక, జౌళి శాఖల మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. చెన్నై నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం ప్రారంభమైన రెండురోజుల అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని ప్రసంగించారు. పదేళ్లకు ముందు ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించినప్పుడు రాష్ట్రాలు ఆర్థిక పరిపుష్టిని కలిగి ఉంటేనే దేశం పురోగమించగలదని చెప్పారని, ఆ దిశగానే 2047లోగా దేశాన్ని సంపన్నదేశంగా మార్చేందుకు ఐదు సూత్రాలను ప్రకటించారని చెప్పారు. బానిసత్వ భావనలకు స్వస్తిపలికి, ప్రాచీన సంప్రదాయాలను గౌరవించాలని, భారతీయులంతా కలిసికట్టుగా దేశ ప్రగతికి తమ వంతు సేవలందించాలని, మహిళాభ్యుదయానికి అగ్రతాంబూలం ఇవ్వాలని మోదీ పిలుపునిస్తున్నారని పేర్కొన్నారు. తమిళనాడుకు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ప్రాచీన కాలం నుంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, అది సంస్కృతీపరమైన ఆత్మీయ బంధమన్నారు. ఈ బంధాన్ని ఎలుగెత్తి చాటేది కాశీ తమిళ సంగమం, సౌరాష్ట్ర తమిళ సంగమం వేడుకలను ఘనంగా నిర్వహించామన్నారు. ప్రధాని మోదీ మదిలో తమిళనాడుకు ప్రత్యేక స్థానం ఉంది కనుకనే కొత్త పార్లమెంట్ భవనంలో సెంగోల్‌ను ప్రతిష్ఠింపజేశారని చెప్పారు. జౌళిశాఖ మంత్రిగా ఏడు జౌళి పార్కులను ప్రారంభించామని, వాటిలో మొదటిది తమిళనాడులోని విరుదునగర్‌లో స్టాలిన్‌తో కలిసి ప్రారంభించానని చెప్పారు. 2030లోగా వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి స్టాలిన్ పెట్టుబడి దారుల సదస్సును భారీ ఏర్పాట్ల మధ్య నిర్వహించడం ఆనందంగా ఉందని చెప్పారు. అన్ని రంగాలల్లోనూ తమిళులు రాణిస్తారని, శనివారం విజయవంతంగా సూర్యమండలంలో లక్ష్యాన్ని చేరుకున్న ఆదిత్యా ఎల్ -1 ప్రాజెక్టు డైరెక్టర్ తమిళనాడుకు చెందిన నికర్‌షాజీ అని, ఆయన సేవలను ప్రశంసిస్తూ అందరూ లేచి హర్షధ్వానాలు చేయాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు సదస్సులో పాల్గొన్నవారంతా ఇస్రో సైంటిస్టులను అభినందించేలా నిమిషం పాటు చప్పట్లు చరిచారు.

తెలుగు వారికి అండగా

తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్


● ఘనంగా సంక్రాంతి సంబరాలు



సినీ నటులు సంపూర్ణేశ్ బాబు, సంజోష్‌లకు గజమాల సత్కారం - దేవరకొండ రాజు-సూర్యకుమారి దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు



ప్యారీస్, జనవరి 7: తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సరం, సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సాలిగ్రామంలోని ప్రసాద్ ల్యాబ్ ఆడిటోరియం వేదికగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరకొండ రాజు సారథ్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ప్రముఖుల ప్రసంగాలు, భరత నాట్యం, కూచిపూడి నాట్యం, ముగ్గులు, వంటల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సత్కారాలతో ఆద్యంతం సందడిగా సాగింది. సంక్రాంతికి విడుదల కానున్న 'సోదర' చిత్ర హీరోలు సంపూర్ణేశ్ బాబు, సంజోష్, సినీ నటుడు కూల్ సురేష్, శ్రీ గంగా ట్రాన్స్‌పోర్ట్ అధినేత లయన్ వీజీ జయకుమార్, డాక్టర్ ఇలయ కట్టబ్రహ్మన, ఆధ్యాత్మిక ప్రవచనకర్త వీరం భట్లయ్య స్వామి, శివాజీ రాజా, ఆంధ్ర కళా స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు, సినీ నిర్మాత కిరణ్‌కుమార్, రిటైర్డ్ జడ్జి రామస్వామి తదితర ప్రముఖులను దేవరకొండ రాజు సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా దేవరకొండ రాజు మాట్లాడుతూ... సంస్థ తరఫున ఇప్పటివరకు విభిన్న రంగాల్లో ప్రఖ్యాతిగాంచిన ప్రముఖులను ఆహ్వానించి పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. విద్యలో బాగా రాణిస్తున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. తమిళనాట స్థిరపడిన తెలుగు వారికి తమ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఆయన సభాముఖంగా తెలిపారు. సినీ నటులు సంపూర్ణేశ్ బాబు, సంజోష్, కూల్ సురేష్ మాట్లాడుతూ... సంక్రాంతి పండుగను ఆహ్వానిస్తూ నగరంలో దేవరకొండ రాజు నిర్వహణలో జరుపుకున్న వేడుకల్లో పాల్గొనడం మహానందం కలిగించిందన్నారు. అనంతరం రాజు, సూర్యకుమారి దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే, అతిథులు, ప్రముఖులను కూడా దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గులు, వంటల పోటీల్లో పాల్గొన్న వారితో పాటు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్న వారికి, నర్తకీమణులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.



లక్ష్మీ శైన్య భరత నాట్యం

'సంక్రాంతి' టోకెన్ల పంపిణీ

● ఇంటింటికీ వెళ్లి అందజేత



అడయార్, జనవరి 7: సంక్రాంతి కానుక కింద ప్రభుత్వం ఇచ్చే రూ.1000 నగదును ఇచ్చేందుకు టోకెన్లను ఆదివారం నుంచి పంపిణీకి శ్రీకారం చుట్టారు. రేషన్‌షాపు సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఈ టోకెన్లను అందజేశారు. యేటా సంక్రాంతికి పొంగల్ కానుక అందిస్తున్న విషయం తెల్సిందే. ఈ పొంగల్ కానుకలో బియ్యం, చక్కెర, చెరకు గడ, చీర, ధోవతితో పాటు రూ.వెయ్యిని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ యేడాది ఈ నెల 15 సంక్రాంతి పండుగ జరుపుకోనున్నారు. ఈ పండుగను పురస్కరించుకుని పొంగల్ కానుకను అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మొత్తం 2.20 కోట్ల రేషన్‌కార్డుదారులకు ఈ సంక్రాంతి కానుకలతో పాటు రూ.వెయ్యి పంపిణీ చేయనున్నారు. ఈ నగదు బహుమతి సాఫీగా సాగేందుకు వీలుగా ముందుగా టోకెన్లను పంపిణీ చేస్తారు. ఈ టోకెన్లు ఆయా ప్రాంతాల్లోని రేషన్ దుకాణ సిబ్బంది ద్వారా ఆదివారం ఉదయం నుంచి ప్రతి ఇంటింటికి వెళ్ళి అందజేశారు. ఈ టోకెన్లను మరో రెండ్రోజులు పంపిణీ చేస్తారు. ఈ నెల 10వ తేదీ బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 వేల రేషన్ దుకాణాల్లో ఈ సంక్రాంతి కానుకలు అందజేసేలా ఏర్పాట్లు చేశారు. చెన్నై నగరంలో ఈ సంక్రాంతి కానుకతో పాటు రూ.వెయ్యి నగదును పంపిణీ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఆయా జిల్లాల్లో మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అందజేస్తారు. పదో తేదీ నుంచి 13వ తేదీ వరకు ఈ నగదు బహుమతితో పాటు సంక్రాంతి కానుక అందజేసేలా చర్యలు తీసుకుంటారు. ఈ నగదు పంపిణీ సమయంలో ఎలాంటి తోపులాటలు తొక్కిసలాటలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీస్ అధికారులు భద్రత కల్పిస్తారు. అదేవిధంగా ప్రతి నెలా 15వ తేదీన మహిళలకు అందజేసే మహిళా సాధికార నగదు బహుమతి రూ.1000 కూడా ముందుగానే అందజేస్తారు. ఈ పథకం కింద ఈ నెల 10వ తేదీన 1.15 కోట్ల మందికి ఈ నగదును వారివారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు.



నగరంలో ఆదివారం వేకువజాము ఓ వైపు మంచు మరో వైపు వానజల్లులు కురుస్తుండటంతో లైట్లు వేసుకుని వెళుతున్న వాహనదారులు

చెన్నై, కంచికి భారీ వర్ష సూచన

వాతావరణ శాఖ హెచ్చరిక ● మరో 15 జిల్లాలకు తేలికపాటి వాన

అడయార్, జనవరి 7: బంగాళాఖాతంలో బాహ్య ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావం కారణంగా చెన్నైతో పాటు కాంచీపురం జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే, విల్లుపురంతో పాటు 15 జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. చెన్నై నగరంలో ఆదివారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎగ్మోరు, తిరువాన్మియూరు, పాలవాక్కం, చెమ్మంజేరి, తరమణి, పెరుంగుడి, మైలాపూర్, నుంగంబాక్కం, వేళచ్చేరి, సైదాపేట, టి.నగర్ తదితర ప్రాంతాల్లో జల్లులు కురుస్తున్నాయి. ఈ విషయంపై చెన్నై వాతావారణ శాఖ ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. లక్షద్వీప్‌తో పాటు దానిని ఆనుకుని వున్న ప్రాంతాలతో పాటు నైరుతి బంగాళాఖాతంలో నెలకొన్న ఆవర్తన ద్రోణి ప్రభావం కారణంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, పుదుచ్చేరిలో తిరువళ్లూరు, చెన్నై, రాణిపేట, కాంచీపురం, కాంచీపురం, కళ్ళకుర్చి, అరియలూరు, మైలాడుదురై, తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి, తిరునెల్వేలిలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

సమాచార దర్శిని

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

ఐసిఎఫ్, జనవరి 7: తేనాంపేట మండలం వెంకటనారాయణ రోడ్డు, సేవియర్స్ రోడ్డులో తాగునీటి పైప్ లైన్ అనుసంధాన పనులు జరుగనున్నాయి. ఈ కారణంగా సోమ, మంగళవారాల్లో తేనాంపేట, కోడంబాక్కం, అడయార్ మండల పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాలకు ట్యాంకర్ లారీల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు, అత్యవసర సేవలకు మెట్రోవాటర్ బోర్డు వెబ్‌సైట్ సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రధాని మోదీ తిరుప్పూర్ పర్యటన రద్దు

పెరంబూర్, జనవరి 7: తిరుప్పూర్‌లో ఈనెల 19న జరిగే బహిరంగసభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొంటారని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీ పర్యటన రద్దయినట్లు తిరుప్పూర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సెంథిల్‌వేల్ పేర్కొన్నారు. ఈనెల 19న తిరుప్పూర్‌కు రానున్న ప్రధాని ఈఎస్ఐ ఆసుపత్రి ప్రారంభోత్సవం, అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో జరిగే బహిరంసభలో పాల్గొంటారని ఇదివరకే ప్రకటించామని, కానీ కారణాల రీత్యా ప్రధాని పర్యటన రద్దయిందన్నారు. ప్రధాని పాల్గొనే తేదీని తర్వాత ప్రకటిస్తామని సెంథిల్‌వేల్ తెలిపారు.

తిరునల్వేలి - తిరుచెందూర్ మధ్య రైళ్ల సేవలు ప్రారంభం

పెరంబూర్, జనవరి 7: తిరునల్వేలి - తిరుచెందూర్ మధ్య ఆదివారం నుంచి రైళ్ల సేవలు పునఃప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా వరదలతో తిరునల్వేలి - తిరుచెందూర్ మధ్య శ్రీవైకుంతం, ఆళ్వార్‌తిరునగరి, నజరేత్ తదితర ప్రాంతాల్లో రైలు మార్గం కొట్టుకుపోవడంతో గత నెల 17వ తేది నుంచి ఈ మార్గంలో రైళ్ల సేవలు నిలిచిపోయాయి. కొత్త రైలు మార్గం ఏర్పాటు, విద్యుత్, సిగ్నలింగ్ వ్యవస్థ పునరుద్ధరించడంతో శనివారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో, ఆదివారం నుంచి ఈ మార్గంలో రైళ్ల సేవలు పునఃప్రారంభమయ్యాయి.

నేటి ఈసీ సమావేశం రద్దు

పెరంబూర్, జనవరి 7: నగరంలో ఈనెల 8న సోమవారం జరగాల్సిన ఎన్నికల కమిషన్ సమావేశం వాయిదా పడింది. మే నెలలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల ముందస్తు పనులను కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టింది. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల్లో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లు, భద్రత తదితరాలపై ఆయా రాష్ట్రాల ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమవుతోంది. ఈ నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్‌కుమార్ సోమవారం నగరంలో రాష్ట్ర ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమవుతారని ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో, సోమవారం జరగాల్సిన సమావేశం తేది ప్రకటించకుండా వాయిదా పడిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు పేర్కొన్నారు.

ప్రొఫెసర్లకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

పెరంబూర్, జనవరి 7: మద్రాసు విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన 1,065 మంది ప్రొఫెసర్లకు సోమవారం నుంచి నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్రప్రభుత్వ 'నాన్ ముదల్‌వన్' పథకంలో కళాశాల ప్రొఫెసర్లకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. తొలివిడత శిక్షణ ఈనెల 8న సోమవారం నుంచి 12వ తేది వరకు, రెండో విడత శిక్షణ 18 నుంచి 24వ తేది వరకు జరుగుతుందని వర్శిటీ తెలిపింది.

గణతంత్ర వేడుకల్లో రాష్ట్రప్రభుత్వ శకటం ఎంపిక

పెరంబూర్, జనవరి 7: ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవాల్లో రాష్ట్రప్రభుత్వ శకటం పాల్గొనేందుకు అనుమతి లభించింది. యేటా జనవరి 26వ తేది గణతంత్ర దినోత్సవాలను కోలాహలంగా జరుపుకుంటారు. ఢిల్లీలో జరిగే వేడుకల్లో త్రిదళ కవాతు, విన్యాసాలు, సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన శకటాలు, రాష్ట్రప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు తెలియజేసే శకటాల ప్రదర్శన జరుగుతుంది. ఈ ఏడాది గణతంత్ర వేడుకల్లో 15 రాష్ట్రప్రభుత్వాలు, ఒక కేంద్ర పాలిత రాష్ట్రానికి అనుమతి లభించింది. ఈ జాబితాలో తమిళనాడు చోటు దక్కింది. కాగా, ఈ ప్రదర్శనలో కర్ణాటక, పశ్చిమబెంగాల్, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చోటు దక్కలేదు.

కూడన్‌కుళం విద్యుదుత్పత్తి నిలిపివేత

ఐసిఎఫ్, జనవరి 7: తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రంలో ఈ నెల 24వ తేది నుంచి 75 రోజులు విద్యుదుత్పత్తి నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో తలా 1,000 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. అందులో రాష్ట్రానికి ప్రతిరోజు 1,152 మెగావాట్ల విద్యుత్ కేటాయిస్తున్నారు. రాష్ట్రంలో మంచు కురుస్తున్నప్పటికీ విద్యుత్ వినియోగం తగ్గడం లేదు. ప్రతిరోజు పగలు 15,000 మెగావాట్లు, సాయంత్రం 16,000 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతోంది. ఈ నేపథ్యంలో, కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రం మొదటి యూనిట్‌లో ఇంధనం నింపే పనుల కోసం ఈనెల 24నుంచి 75 రోజులు ఉత్పత్తి నిలిపివేసి ఏప్రిల్ 11న పునఃప్రారంభించనున్నారు. దీని వల్ల ఏర్పడే విద్యుత్ కొరతను ఎదుర్కొనేలా 4,320 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయాలని ఈబీ నిర్ణయించింది.

10 నుంచి టాన్సెట్ దరఖాస్తుల స్వీకరణ

ఐసిఎఫ్, జనవరి 7:ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ వంటి పీజీ కోర్సులకు సంబంధించిన టాన్సెట్‌ప్రవేశపరీక్ష దరఖాస్తుల స్వీకరణ ఈనెల 10వతేది ప్రారంభం కానుంది.రాష్ట్రంలో అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కళాశాలలు, ఇతర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలల్లో నిర్వహించే ఈకోర్సుల్లో చేరేందుకు రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో మార్చి 9వతేది ప్రవేశపరీక్షజరగనుంది.http-s://tancet.annauniv.edu/tancetలో ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 7వ తేది వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షా ఫలితాలు మేలో విడుదల అవుతాయి.



పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

చిరుత దాడిలో బాలిక మృతి

సీఎం సంతాపం ● ఎట్టకేలకు పట్టివేత

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా పందలూరు సమీపం ఏలమన్నా గ్రామంలో చిరుత దాడిలో నాన్సీ(3) బాలిక మృతి చెందింది. ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు ఆదివారం ఉదయం బంద్ నిర్వహించారు. బాలికపై దాడి జరిపిన చిరుతను వెంటనే పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. ఏలమన్నా తేయాకు తోటల్లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నాన్సీ కుటుంబం పనిచేస్తోంది. శనివారం మధ్యాహ్నం నాన్సీ (3)పై చిరుత దాడి జరిపి పొదలమాటుకు లాక్కెళ్లింది. వెంటనే కార్మికులంతా బిగ్గరగా కేకలు పెట్టి కట్టెలతో చిరుతపై దాడి జరిపారు. దీనతో బాలికను విడిచిపెట్టి పారిపోయింది. ఆ తర్వాత బాలికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక నాన్సీ మృతి చెందింది. ఈ సంఘటన గురించి తెలుసుకున్న నాన్సీ కుటుంబ సభ్యులు స్థానికులు ధర్నా నిర్వహించారు. గూడలూరు, పందలూరు ప్రాంతాల్లో వ్యాపారులు దుకాణాలు మూసివేసి బంద్ పాటించారు. గత డిసెంబర్ 29న సరితా (29) అనే మహిళ కూడా చిరుత దాడిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చిరుతను బంధించేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సీఎం సంతాపం...

ఇదిలా ఉండగా చిరుత దాడిలో బాలిక మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం ప్రకటన జారీ చేశారు. డిసెంబర్‌లోనూ ఆ ప్రాంతంలో చిరుత దాడిలో సరితా అనే మహిళ ప్రాణాలు పోగొట్టుకోవడం విచారకరమన్నారు. చిరుత దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఇరువురి కుటుంబీకులకు తలా రూ.10లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు.

చిరుత పట్టివేత... : ఇరువురి మృతి కారణమైన చిరుతను ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు ఆదివారం సాయంత్రం బంధించారు. మత్తుమందు సూదులు ప్రయోగించి దానిని నిర్బంధించారు. ఆంబ్రోస్ ప్రాంతంలోని ఓ పొదలమాటున దాగిన ఆ చిరుతను అటవీ శాఖ అధికారులు తుపాకులతో మత్తు సూదులు ప్రయోగించి పట్టుకున్నారు. దీంతో బంద్ పాటించిన గూడలూరు, పందలూరు ప్రాంతానికి చెందినవారంతా హర్షం ప్రకటించారు.



చిరుత దాడిలో గాయపడిన నాన్సీని ఆసుపత్రికి తీసుకెళుతున్న స్థానికులు

'108' అంబులెన్స్ సేవల ద్వారా 19 లక్షల మంది లబ్ధి

పెరంబూర్, జనవరి 7: అత్యవసర సేవలందించే '108' అంబులెన్స్‌ల ద్వారా గత ఏడాది 19 లక్షల మంది లబ్ధిపొందారు. వారిలో 5 లక్షల మంది ప్రసవం కోసం వైద్యసహాయాలు పొందారు. ఈ విషయమై 108 అంబులెన్స్ సేవల రాష్ట్ర అధ్యక్షుడు సెల్వకుమార్ మాట్లాడుతూ... చెన్నై సహా పలు జిల్లాల్లో సాయం కోరిన వెంటనే 7 నిమిషాల్లో ఆయా ప్రాంతాలకు చేరుకొనేలా వసతులు అభివృద్ధి చేశామన్నారు. గత ఏడాది ప్రసవం కోసం 5,07,071 మందిని అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించామన్నారు. అలాగే, రోడ్డు ప్రమాదాలకు గురైన 3,34,527 మంది, గుండెపోటు బాధితులు 1.19 లక్షలు, 33 వేల మంది చిన్నారులను 108 అంబులెన్స్‌ల ద్వారా ఆసుపత్రులకు తరలించామని తెలిపారు. ఇక, చెన్నైలో 6,044 మంది గర్భిణులు సహా 1.05 లక్షల మంది ఈ అత్యవసర చికిత్సలు వినియోగించుకున్నారని ఆయన తెలిపారు.

23.18 లక్షల మందికి వరద సాయం

పెరంబూర్, జనవరి 7: తుఫాను బాధితులు 23.18 లక్షల మందికి రేషన్ దుకాణాల ద్వారా వరద సాయం అందించినట్లు రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. వరద సాయం నగదు బ్యాంక్ ఖాతాల ద్వారా అందించే పిటిషన్‌కు హైకోర్టు ఉత్తర్వులతో రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో... తుఫాను ప్రభావంతో నష్టపోయిన 24.25 లక్షల కుటుంబాలకు తలా రూ.6,000 అందించేలా రూ.1,455 కోట్లు విడుదల చేశామన్నారు. తుఫానుతో ఏటీఎం కార్డులు, బ్యాంక్ పుస్తకాలు కొట్టుకుపోయాయని బాధితులు తెలపడంతో, నగదు రూపంలో సాయం అందించినట్లు తెలిపింది. అలాగే, సాయం కోరుతూ 7.03 లక్షల మంది సమర్పించిన దరఖాస్తుల పరిశీలన చేపట్టామని, అర్హులైన వారి బ్యాంక్ ఖాతాల్లో త్వరలో నగదు సాయం జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది.

బుద్ధుడి విగ్రహంతో తీరానికి కొట్టుకొచ్చిన తెప్ప

పెరంబూర్, జనవరి 7: రామనాథపురం జిల్లా రామేశ్వరం సముద్రతీరం ఉత్సవాల్లో ఉపయోగించే తెప్ప కొట్టుకొచ్చినట్టు కోస్ట్‌గార్డ్‌కు జాలర్లు సమాచారం అందించారు. కోస్ట్‌గార్డ్ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని దాన్ని పరిశీలించారు. వెదురు కర్రలతో చేసిన ఆ తెప్పపై బుద్ధుడి విగ్రహం, పూజా సామగ్రి ఉండడాన్ని గుర్తించారు. మయన్మార్ దేశ ప్రజలు బుద్ధుడి ఉత్సవాల్లో తెప్పోత్సవం నిర్వహిస్తుంటారని, గాలుల వేగంతో ఈ తెప్ప రామేశ్వరానికి కొట్టుకొచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన కోస్ట్‌గార్డ్ అధికారులు, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు.



తెప్పను పరిశీలిస్తున్న అధికారులు (అంతర్ చిత్రంలో) తెప్పలోని బుద్ధుడి విగ్రహం

తాగునీటి కోసం రాస్తారోకో

పెరంబూర్, జనవరి 7: తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని కోరుతూ ఆదివారం ఉదయం ఈరోడ్‌వాసులు రాస్తారోకో చేపట్టారు. ఈరోడ్ కార్పొరేషన్ 1వ మండల పరిధిలోని 6వ వార్డులో జ్ఞానపురం, పచ్చపాలిమేడుల్లో కొద్ది రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. మూడు రోజులకు ఒకసారి కొద్ది సమయం మాత్రమే వదులుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానికులు ప్రజా ప్రతినిధులకు, కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం బిందెలతో ఈరోడ్ - శక్తి రోడ్డుపై బైఠాయించారు. పోలీసులతో అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. సమస్య సత్వరం పరిష్కరిస్తామని, అప్పటివరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

సైన్స్ సమాఖ్య నిర్వాహకుల ఎంపిక

వేలూరు, జనవరి 7: తమిళనాడు సైన్స్ సమాఖ్య కాట్పాడి యూనియన్ శాఖ సదస్సు ఆదివారం కాట్పాడి సెంగుట్టై తిరువళ్లువర్ గ్రంథాలయంలో జరిగింది. కార్యక్రమానికి కవిమామణి అరివు సుడర్ అధ్యక్షత వహించగా, జిల్లా సెక్రటరీ, న్యాయవాది మునుస్వామి, ఆక్సీలియం కళాశాల సెక్రటరీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన నిర్వాహకులను ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా జనార్దనన్, గౌరవ అధ్యక్షుడిగా అరివుసుడర్, సెక్రటరీగా రాధాకృష్ణన్, కోశాధికారిగా ఈశ్వరి, ఉపాధ్యక్షులుగా శివవడివు, వాసుకా చంద్రశేఖరన్, జాయింట్ సెక్రటరీలుగా ప్రకాష్, షకిలావాణి, కార్యకర్తల కమిటీ సభ్యులుగా ముత్తు, పునిత, సుగుణలత ఎంపికయ్యారు.



తమిళనాడు సైన్స్ సమాఖ్య నూతన కార్యవర్గం

వేలూరు బ్రాహ్మణ సంఘం కొత్త నిర్వాహకుల ఎంపిక

వేలూరు, జనవరి 7: వేలూరు బ్రాహ్మణ సంఘం కొత్త నిర్వాహకుల పదవీ స్వీకారం ఆదివారం జరిగింది. సత్తువాచేరిలో జరిగిన కార్యక్రమానికి వేలూరు శాఖ బ్రాహ్మణ సంఘం సలహాదారు సత్యమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికల సూపర్‌వైజర్లుగా తాంరస్, రాష్ట్ర ఉప సెక్రటరీ కృష్ణమూర్తి పాల్గొన్నారు. అధ్యక్షుడిగా రాజ, ప్రధాన కార్యదర్శిగా జయకుమార్, కోశాధికారిగా రాజగోపాల్, సలహాదారులుగా సత్యమూర్తి, కృష్ణమూర్తి, సుబ్రమణి, ఉప కార్యదర్శిగా విజయరాఘవన్, మహిళా కార్యదర్శిగా లలిత కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా రాధామణి, మీనాక్షి, బృంద, బ్రహ్మతీర్థం ఎంపికయ్యారు.



బ్రాహ్మణ సంఘం కొత్త నిర్వాహకులు

అయ్యప్ప భక్తులకు 10 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు

పెరంబూర్, జనవరి 7: శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు రాష్ట్రప్రభుత్వం 10 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు అందజేసింది. ఈ మేరకు తిరువాంకూర్ దేవస్థానం బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... బిస్కెట్లతో కూడిన వాహనాలను శుక్రవారం హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పంపించారన్నారు.పంబ నుంచి సన్నిధానం వరకు పలు ప్రాంతాల్లో భక్తులకు బిస్కెట్ ప్యాకెట్లతో పాటు మూలికలతో కూడిన తాగునీరు అందిస్తున్నట్లు బోర్డు తెలిపింది.

రేపటినుంచి ఐలాండ్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్

ఐసిఎఫ్, జనవరి 7: స్థానిక మెరీనా తీరం సమీపంలో ఉన్న ఐలాండ్ గ్రౌండ్‌లో 48వ పర్యాటక, వాణిజ్య ప్రదర్శన మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. యేటా ఇక్కడ పిల్లల నుంచి పెద్దల వరకు అందర్నీ ఆకర్షించేలా వినోద అంశాలతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తుం టారు. 48వ వార్షిక ఎగ్జిబిషన్‌లో స్టాళ్లు, రంగుల రాట్నాలు వంటివి ఏర్పాట య్యాయి. 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వినోద క్రీడా పార్కు ఏర్పాటు చేయగా, 45కు పైగా క్రీడా సాధనాలు దిగుమతి చేసుకున్నారు. ఈ ప్రదర్శన 70 రోజుల పాటు జరుగుతుంది.

డబుల్ డెక్కర్ రైలుకు మూడు నాన్ ఏసీ కోచ్‌లు

ఐసిఎఫ్, జనవరి 7: చెన్నై - బెంగళూరు డబుల్ డెక్కర్ రైలుకు మూడు నాన్ ఏసీ కోచ్‌లు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. 2020 అక్టోబరులో ఈ డబుల్ డెక్కర్ సూపర్‌ఫాస్ట్ రైలును ప్రారంభించారు. సెంట్రల్ నుంచి ఉదయం 7.25 గంటలకు బయల్దేరే రైలు మధ్యాహ్నం 1.10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. అక్కడ మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరి రాత్రి 8.35 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది. 12 పెట్టెలు కలిగిన ఈ రైలుకు ఏసీ లేని మరో మూడు కోచ్‌లు అనుసంధానం చేసి, ఫిబ్రవరి 15వ తేదీ నుంచి నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

10 వరకు జీఎస్టీ దాఖలుకు అవకాశం

ఐసిఎఫ్, జనవరి 7: జీఎస్టీ ఫారం దాఖలుకు ఈనెల 10వ తేది వరకు అవకాశమిచ్చినట్లు వాణిజ్య పన్ను శాఖ కార్యదర్శి తెలిపారు. భారీవర్షాల కారణంగా నష్టపోయిన తిరునల్వేలి, తెన్‌కాశి, కన్నియాకుమారి, తూత్తుకుడి, విరుదునగర్ జిల్లాల వ్యాపారుల సంక్షేమం కోసం నవంబరు జీఎస్టీఆర్-3బీ ఫారం దాఖలు చేసే గడువు డిసెంబరు 20 వరకు ఉండగా, ఆ గడువు ఈనెల 10వ తేది వరకు పొడిగించారు.

హోమియోపతి కళాశాలకు భవనం

ఐసిఎఫ్, జనవరి 7: మదురై హోమియోపతి కళాశాలకు రూ.70 కోట్లతో కొత్త భవనం నిర్మించనున్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. శిథిలావస్థకు చేరుకున్న మదురై హోమియోపతి ప్రభుత్వ వైద్యకళాశాలకు మదురై ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటుకానున్న స్థలంలో రూ.70 కోట్లతో కొత్త భవనం నిర్మించనున్నట్లు పేర్కొంది. అలాగే, పారంపర్య సిద్ధ వైద్యులకు పింఛన్ రూ.1,000 నుంచి రూ.3,000లకు పెంచనున్నట్లు వెల్లడించింది.

డ్రోన్ల ద్వారా నీలగిరి మేకల గణన

ఐసిఎఫ్, జనవరి 7: నీలగిరి మేకల గణన డ్రోన్ల ద్వారా చేపట్టనున్నట్లు రాష్ట్ర పర్యావరణ శాఖ కార్యదర్శి సుప్రియ సాహు తెలిపారు. రాష్ట్ర జంతువు నీలగిరి మేకలను సంరక్షించేందుకు అక్టోబరు 12వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ పథకం ప్రారంభించారని తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఉన్న భారత వన్యమృగ సంస్థ రాష్ట్రంలో ఉన్న వన్యమృగ భద్రతా సంస్థలు సంయుక్తంగా వాల్పారై, ఆనమలై పులుల శరణాలయం తదితర ప్రాంతాల్లో ఉన్న నీలగిరి మేకల గణన చేపట్టనున్నారని పేర్కొన్నారు. మార్చి, ఏప్రిల్‌లో తొలిసారిగా డ్రోన్ ద్వారా చేపట్టనున్నామని తెలిపారు.

కాగ్‌లియరీ మెషిన్ శస్త్రచికిత్సపై సదస్సు

వేలూరు, జనవరి 7: స్థానిక శ్రీ నారాయణి ఆసుపత్రిలోని ఈఎన్‌టీ శాఖలో కాగ్‌లియరీ మెషిన్ శస్త్రచికిత్సపై సదస్సు జరిగింది. కాగ్‌లియరీ మెషిన్ అంటే ఒక రక మైన వినికిడి యంత్రం. వినపడని వారికి ఈ పరికరాన్ని అమరుస్తారు. ఈ యంత్రాలను పేదల కు తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు నారాయణి ఆసుపత్రి తెలిపింది. ఈ సద స్సులో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజి మాట్లాడుతూ... శక్తి అమ్మ 48వ జయంతి సందర్భంగా 10 మందికి ఉచితంగా రూ.7 లక్షల విలువైన ఆపరే షన్లను చేసినట్లు తెలిపారు. సదస్సులో చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రి ఈఎన్‌టీ శాఖ అధ్యక్షుడు భారతి మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ గీత ఇనియన్, ఈఎన్‌టీ డాక్టర్లు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, రాఘవి పాల్గొన్నారు.

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక స్టాల్

ఐసిఎఫ్, జనవరి 7: ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తులు విక్రయించేందుకు నెలలో 10 రోజులు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కృష్ణ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మహిళల కోసం వృత్తి శిక్షణ, వృత్తులు ప్రారంభించేందుకు అన్నిరకాల సహాయాలను తమ సంఘం అందిస్తుందని తెలిపారు. వారి అభివృద్ధి కోసం ప్రతి జిల్లాలో నెలలో 5 నుంచి 10 రోజులు స్టాళ్లు ఏర్పాటుచేసి ఉత్పత్తులు విక్రయించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వివరాలకు నెం.7871702700, 9361086551లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'ఖేలో ఇండియా' ప్రచార వాహనం ప్రారంభం

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు ప్రధాన నగరాల్లో ఈనెల 19 వ తేదీ నుంచి నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడా పోటీలకు ప్రచారానికి ప్రత్యేకంగా రూపొందించిన వాహనాన్ని యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి జెండా ఊపి ప్రారంభించారు. మెరీనా బీచ్ లైట్‌హౌస్ వద్ద ఆదివారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఉదయనిధి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ సమక్షంలో ఈ ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఖేలో ఇండియా క్రీడా పోటీలు ఈనెల 19 నుంచి 31 వరకు చెన్నై, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు నగరాలలో జరగనున్నాయని, అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 5500 మంది యువ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనున్నారని మంత్రి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి జ్యోతి ఊరేగింపు కూడా నిర్వహిస్తామని, 38 జిల్లాల్లో ఈ జ్యోతిని క్రీడాకారులు ఊరేగించి చెన్నైలోని నెహ్రూ స్టేడియంకు తిసుకురానున్నారని తెలిపారు.



ప్రచారవాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి

వివేకానంద జూనియర్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో సీపీ రాధాకృష్ణన్, అపవర్గానంద తదితరులు

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని కస్తూర్బా నేమిచంద్‌షా పి. ముత్యాలు చెట్టి వివేకానంద విద్యాలయ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్, మైలాపూరు శ్రీరామకృష్ణమఠం స్వామి అపవర్గానంద ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ కేత శ్రీనివాసన్ స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శుభాశ్రీ అతిథులకు స్వాగతం పలికారు. ఆ సందర్భంగా విద్యార్థులు కొత్త కుండలో పొంగళ్లు పెట్టి సూర్యభగవానుడికి నైవేద్యంగా సమర్పించారు. పొంగలి పొంగుతుండగా విద్యార్థులంతా 'పొంగలో పొంగల్' అంటూ నినాదాలు చేశారు. ఇక సంక్రాంతి సంబరాలతోపాటు స్వామి వివేకానంద జయంతి, తిరువళ్లువర్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. వివిధ పోటీల్లో విజేతలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బహుమతులు ప్రదానం చేశారు.

నేలబొగ్గు తీసుకెళ్తున్న బోగీలో మంటలు

పెరంబూర్, జనవరి 7: స్థానిక గుమ్మిడిపూండి నుంచి అరక్కోణం మీదుగా సేలం థర్మల్ విద్యుత్ కేంద్రానికి నేలబొగ్గు తీసుకెళ్తున్న గూడ్సు రైలులో మంటలు చెలరేగాయి. ఈ రైలు శనివారం అర్ధరాత్రి తిరువళ్లూర్ రైల్వేస్టేషన్ దాటుతున్న సమయంలో చివరి బోగీలో పొగలు రావడాన్ని గుర్తించిన రైల్వేపోలీసులు అరక్కోణం రైల్వే అధికారులకు సమాచారం అందించారు. అరక్కోణం చేరుకున్న రైలును 6వ ప్లాట్‌ఫాంపై నిలిపి మంటలు చెలరేగుతున్న బోగీని రైలు నుంచి విడదీసి, విద్యుత్ మార్గంలేని ప్రాంతానికి తీసుకెళ్లి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని సుమారు మూడు గంటలు శ్రమించి మంటలను అదుపుచేశారు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం రైలు సేలం బయల్దేరి వెళ్లింది.



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇంటి గోడ కూలి విద్యార్థిని మృతి

పెరంబూర్, జనవరి 7: ఇండి గోడ కూలి కళాశాల విద్యార్థిని మృతి చెందింది. తేని జిల్లా పాడి సమీపంలో శివమలైకి చెందిన పుష్పం భర్త ముత్తు నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, కుమార్తె సత్యతో కలసి నివసిస్తోంది. సత్య అదే ప్రాంతంలోని కళాశాలలో చదువుతోంది. ఈ నేపథ్యంలో, జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో, వీరు నివసిస్తున్న ఇల్లు బీటలు వారింది. గమనించిన చుట్టుపక్కల వారు ఇంటిని వదలివెళ్లాలని తెలిపినా వారు అక్కడే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం హఠాత్తుగా ఇంటి గోడ కూలడంతో, శిథిలాల కింద చిక్కుకొని సత్య సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, పుష్పంకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకొని శిథిలాల నుంచి సత్య మృతదేహం వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మృతురాలు సత్య (ఫైల్ ఫొటో)

నగలు, నగదు చోరీ

ఐసిఎఫ్, జనవరి 7: వైద్య దంపతుల ఇంట్లో 87 సవర్ల నగలు, రూ.3 లక్షల నగదు చోరీకి గురైంది. నాగర్‌కోయిల్ పార్వతిపురం సమీపంలో ఉన్న ప్లజెంట్ నగర్‌కు చెందిన డాక్టర్ కలైకుమార్, డాక్టర్ పునిదవతి దంపతులు వేర్వేరు ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరి కుమార్తె విదేశాల్లో చదువుతోంది. శనివారం ఉదయం ఇరువురు విధులకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగొచ్చిన దంపతులు, వెనుక వైపు తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించి దిగ్ర్భాంతి చెందారు. ఈ ఘటనపై ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన స్థానిక పోలీసులు, చోరీకి పాల్పడిన ఆగంతకుల కోసం గాలిస్తున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి మద్దతివ్వం

● రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు తమిళరసన్

వేలూరు, జనవరి 7: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వమని రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు తమిళరసన్ స్పష్టం చేశారు. ఆ పార్టీ జిల్లా నిర్వాహకుల సమావేశం ఆదివారం సత్తువాచేరిలో జరిగింది. వరద సాయంగా తమిళనాడు అధికంగా నిధులు అందజేశామని కేంద్రప్రభుత్వం చెబుతుండగా, తమకు ఇవ్వలేదని రాష్ట్రప్రభుత్వం పేర్కొంటోందన్నారు. ఎవరి మాటలు నిజమా అని రాష్ట్ర ప్రజలు అయోమయంలో ఉన్నారు. ప్రైవేటు శాఖల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ అమలు చేసేలా అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ హామీలు గుప్పిస్తున్నా, ఆచరణలో విఫలమవుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు 95 లక్షల మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, రెండేళ్లుగా డీఎంకే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

కంటి వైద్య ఉచిత శిబిరం

వేలూరు, జనవరి 7: స్థానిక సైదాపేటలోని ఏసీఎస్ వైద్యకళాశాలలో ఆదివారం కంటి వైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంజీఆర్ వర్శిటీ ఛాన్సలర్ ఏసీ షణ్ముగం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేలూరు, ఆనైకట్టు, కేవీకుప్పం, గుడియాత్తం, ఆంబూరు, వాణియంబాడిలలో ఇప్పటివరకు 103 ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి లక్ష మందికి వైద్యచికిత్సలు అందించినట్లు తెలిపారు. అలాగే, వేలూరులో ప్రైవేటు జాబ్ మేళా నిర్వహించి 1,379 మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు.



కంటి అద్దాలు అందజేస్తున్న ఏసీ షణ్ముగం

జాలర్ల వలకు చిక్కిన భారీ ఏమన్ కోలా చేప

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులకు ముందు గిల్లెట్ నెట్ పడవలో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన కాశిమేడు జాలర్ల వలలో 300 కిలోల బరువున్న అరుదైన ఏమన్ కోలా చేప చిక్కింది. ఆ చేపను జాలర్లు అతికష్టం మీద ఆదివారం ఉదయం ఒడ్డుకు తీసుకువచ్చారు. 15 అడుగుల పొడవున్న ఈ కోలా చేపను పడవ నుంచి క్రేన్ ద్వారా వెలికి తీశారు. రాష్ట్రంలో ఈ చేపను తినటానికి ఎవరూ ఇష్టపడరు. అయితే శ్రీలంకలో ఈ రకం చేపకు మంచి గిరాకీ ఉంది. శ్రీలంకవాసులు ఈ చేపను ఎండబెట్టి ఆరగిస్తారు. ఈ నేపథ్యంలో ఈ కోలా చేపను వేలం పాట ద్వారా విక్రయించి, శ్రీలంకకు ఎగుమతి చేసేందుకు జాలర్లు ప్రయత్నాలు చేపడుతున్నారు.



19న విజయకాంత్ సంస్మరణ సభ

ప్యారీస్, జనవరి 7: స్థానిక తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో ఇటీవల మృతి చెందిన డీఎండీకే అధినేత, నటుడు విజయకాంత్ సంస్మరణ సభ నడిగర్ సంఘం ఆధ్వర్యంలో జరగనుంది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానున్న ఈ సభలో నడిగర్ సంఘం ప్రధాన నిర్వాహకులు, నటీనటులు, సినీరంగ ప్రముఖులు పాల్గొని విజయకాంత్‌కు నివాళి అర్పిస్తారని నడిగర్ సంఘం ఓ ప్రకటనలో తెలిపింది.



పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన జల్లికట్టు ఎద్దు విగ్రహం వద్ద ఫొటో తీసుకుంటున్న విదేశీ ప్రతినిధులు



పెట్టుబడిదారుల సదస్సులో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ తన కార్యకలాపాల విస్తరణకు సంబంధించి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న ఆ సంస్థ నిర్వాహకులు



చెన్నైలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడును వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై విద్యార్థులతో కలసి వీక్షిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్


పుస్తకావిష్కరణ దృశ్యం

కళకు... కలైంజర్‌కు మరణం లేదు

సీఎం స్టాలిన్
రూ.500 కోట్లతో ఫిల్మ్ సిటీ
ఘనంగా 'కలైంజర్ 100' వేడుకలు
తరలివచ్చిన తారా లోకం

కళకు, కలైంజర్‌కు మరణం లేదని డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. తమిళ చిత్రపరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్‌కు చెందిన కళాకారులంతా కలిసి మాజీ ముఖ్యమంత్రి, దివంగత కలైంజర్ కరుణానిధి శతజయంతి వేడుకలను 'కలైంజర్-100' పేరుతో శనివారం రాత్రి గిండీలోని మద్రాస్ రేస్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించాయి. ఈ వేడుకలకు కోలీవుడ్‌కు చెందిన తారాగణం, టెక్నీషియన్లతో పాటు చిన్నాపెద్దా అనే తేడాలేకుండా తరలివచ్చారు. ముఖ్య అతిథిగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ... 'రాజకీయాల్లో కలైంజర్ తాకని ఎత్తులు లేవు. దేశ ప్రధానమంత్రులు, రాష్ట్రపతులను నిర్ణయించే స్థాయికి చేరుకున్నారు. తల్లిదండ్రులు పెట్టిన సహజ నామానికి భిన్నంగా 'కలైంజర్' చిరస్థాయిగా నిలిచిపోయింది. 'నాయకుడు'కి అతీతంగా ఒక కళాకారుడిగానే జీవించారు. కళా ప్రపంచానికి, ముత్తమిళ్ అరింజ్ఞర్ కలైంజర్‌కు ఉన్న అవినాభావ సంబంధమే 'కలైంజర్'. కళకలత చెందిన వారికి స్వాంతన కలిగించాలి.

సుఖంగా ఉన్నవారికి భంగం కలిగించరాదు' అన్న సూక్తి ప్రకారం రాజకీయాలను తన రచనల్లో చొప్పించి, సామాజిక అవమానాలను తరిమికొట్టిన అసలుసిసలైన కళాకారుడి కోసం యావత్ చిత్రపరిశ్రమ తరలివచ్చి 'కలైంజర్-100' పేరుతో నివాళులు అర్పించడం మహద్భాగ్యంగా భావిస్తున్నా. అలాంటి నేత సిద్ధాంతాలకు వారసుడిగా, ఆయన ఏలిన తమిళ మట్టికి ముఖ్యమంత్రిగా, ఆయన కుమారుడిగా ఉన్నందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. 65 యేళ్ళపాటు ఆయన ప్రయాణించి రంగం నుంచి తరలివచ్చి ఆయనకు నివాళులు అర్పించిన సోదరసోదరీమణులకు రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నా' అని అన్నారు.

రూ.500 కోట్లతో ఫిల్మ్ సిటీ

ఈ శుభ సందర్భంగా చిత్రపరిశ్రమకు కొన్ని వరాలు ప్రకటిస్తున్నా. స్థానిక తరమణిలోని ఎంజీఆర్ ఫిల్మ్ సిటీలో రూ.5 కోట్లతో 4 షూటింగ్ సెట్‌ల నిర్మాణం త్వరలోనే చేపడుతాం. హీరో కమలహాసన్ కోరిక మేరకు పూందమల్లిలో 140ఎకరాల విస్తీర్ణంలో రూ.500కోట్లతో కొత్త ఫిల్మ్ సిటీని నిర్మిస్తాం. ఈ అత్యాధునిక ఫిల్మ్ సిటీలో వీఎఫ్ఎక్స్ యానిమేషన్, ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ విభాగాలు, ఫైవ్ స్టార్ హోటల్ ఇలా సకల సదుపాయాలను కల్పిస్తాం' అని స్టాలిన్ పేర్కొన్నారు.

ఎంజీఆర్ - శివాజీలను అగ్రహీరోలుగా చేశారు కమల్ హాసన్

తన డైలాగులతో దివంగత మహానటులు శివాజీ గణేశన్, ఎంజీ రామచంద్రన్‌లను గొప్ప నటులుగా కలైంజర్ కరుణానిధి చేశారని విశ్వనటుడు కమల హాసన్ అన్నారు. నా ప్రియమైన మిత్రుడు విజయకాంత్ అంతిమ యాత్రను విజయవంతంగా పూర్తి చేయించిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. కలైంజర్‌లో ఉండే ఈ గుణం... ముఖ్యమంత్రి స్టాలిన్‌లో ఉన్నాయి. సినిమాల్లో ఉన్నపుడు రాజకీయాలను, రాజకీయాలను సినిమాల్లోను మరచిపోకుండా ఉన్న నేత కలైంజర్ తనతో పాటు తమిళ భాషను, తమిళనాడును ఉన్నతంగా తీర్చిదిద్దారు.

చిత్రజ్యోతి

ఆ నటుడు ఎవరో కాదే నేనే రజనీకాంత్

సాధారణంగా కలైంజర్ నటీనటులతో కలిసి సినిమాలు చూస్తారు. అది ఎన్నికల సమయం. ఒక నటుడు ఓటు వేసి బయటకు వచ్చిన తర్వాత మీడియా ఎవరికి ఓటు వేశారు అన్ని ప్రశ్నించగా, రెండాకులు అని సమాధానమిచ్చాడు. ఆ వ్యాఖ్యలు ట్రెండ్ అయ్యాయి. అదే రోజు సాయంత్రం ఒక సినిమా చూడాల్సి ఉంది. ఆ సినిమాకు ఎలా వెళ్లాలో తెలియక... చలిజ్వరం వచ్చిందని చెప్పాడు. కానీ, ఆ నటుడు కచ్చితంగా సినిమా చూసేందుకు రావాలని కలైంజర్ కండిషన్ పెట్టారు. దీంతో థియేటర్‌కు వెళ్లి ఆ నటుడిని చూసి.. రండి రండి.. చలిజ్వరం వచ్చిందని చెప్పారంట కదా.. సూర్యుడి పక్కన కూర్చొండి అంటూ కలైంజర్ అన్నారు. ఆ నటుడు ఎవరో కాదు... నేనే.

తరలివచ్చిన స్టార్లు

'కలైంజర్-100' వేడుకలను తమిళ చిత్రపరిశ్రమకు చెందిన తారాలోకమంతా తరలివచ్చింది. అగ్రహీరోలు సీనియర్ నటుడు శివకుమార్, సూర్య, కార్తీ, ధనుష్, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, హీరో, మంత్రి ఉదయనిధి స్టాలిన్, జయం రవి, శివకార్తికేయన్, ఎస్‌జే సూర్య, పార్తిబన్, ఆర్‌జే బాలాజీ, హీరోయిన్లు నయనతార, కీర్తి సురేష్, గౌతమి, సోనియా అగర్వాల్, రోహిణి, హాస్య నటుడు వడివేలు, దర్శకులు వెట్రిమారన్, పా.రంజిత్, లోకేష్ కనకరాజ్, తంగర్ బచ్చాన్, టి.రాజేంద్రన్, శంకర్, రోజా, నడిగర్ సంఘం నిర్వాహకులు, తమిళ సినీ నిర్మాతలు, 24 క్రాఫ్ట్స్‌కు చెందిన కళాకారులు, టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.


'కలైంజర్' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్



చెన్నై నా సెకండ్ హోం టౌన్ కత్రినా కైఫ్

తనకు ముంబై నగరం మొదటి ఇల్లు అయితే చెన్నై నగరం తనకు రెండో హోం టౌన్ అని బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ అన్నారు. కోలీవుడ్ స్టార్ హీరో 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతితో కలిసి కత్రినా కైఫ్ నటించిన తాజా చిత్రం 'మెర్రీ క్రిస్మస్'. శ్రీరామ్ రాఘవన్ దర్శకుడు. టీను ఆనంద్, సంజయ్‌కపూర్, వినయ్ పాథక్, ప్రతిమా ఖన్నన్, రాధికా ఆప్టే, అశ్విన్ ఖల్సేకర్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. రమేష్ తారణి, సంజయ్ రౌత్రే, జయ తారణి, కెవల్ గార్గ్ నిర్మాతలు. ఈనెల 12వ తేదీన సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తమిళం, హిందీ భాషల్లో విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం చెన్నైలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో కత్రినా కైఫ్ మాట్లాడుతూ... 'హిందీ, తెలుగుతో పాటు ఇతర భాషల్లో నటించా. ఇది నాకు తొలి తమిళ చిత్రం. తమిళ నేటివిటీకి అనుగుణంగా ఉంటుంది. శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతితో కలిసి నటించడం ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేయాలి' అని అన్నారు. హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ... 'నాకు, దర్శకుడు శ్రీరామ్‌కు మధ్య జరిగిన ఒక వీడియో కాల్ సంభాషణ ఈ చిత్రానికి శ్రీకారం చుట్టింది. 'బద్లాపూర్' చిత్రంలో శ్రీరామ్ పనితనం చూసి మంత్రముగ్ధుడిని అయిపోయా. అపుడే శ్రీరామ్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నా. నా కంటే సీనియర్ నటి అయిన కత్రినా కైఫ్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు. దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ మాట్లాడుతూ... 'నేను తమిళుడినే. కానీ, బాంబే, పుణెలలో ఉండిపోయా. తమిళంలో ఒక చిత్రం చేయాలనే చిరకాల కోరిక. 'మెర్రీ క్రిస్మస్'తో ఆ కోరిక తీరింది. భవిష్యత్తులో కూడా మరిన్ని చిత్రాలు తీయాలన్నదే నా కోరిక' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రానికి కెమెరా మధు నీలకంఠన్, ఎడిటింగ్ పూజ, సంగీతం ప్రీతమ్.

ఎట్టకేలకు ఇంటివాడు కాబోతున్న మోస్ట్ బ్యాచిలర్

తమిళ చిత్రపరిశ్రమలో సీనియర్ మోస్ట్ బ్యాచిలర్లలో ప్రేమ్‌జీ అమరన్ ఒకరు. ఈయన ఎట్టకేలకు త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వయసులో తనకంటే 22 యేళ్ల చిన్నదైన యువతిని పెళ్లాడనున్నారు. కచ్చితంగా త్వరలోనే పెళ్లి చేసుకుంటానని ప్రేమ్‌జీ ఇటీవల ప్రకటించిన విషయం తెల్సిందే. ఈ మాటకు కట్టుబడిన ప్రేమ్‌జీ త్వరలోనే పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో సినీ నేపథ్యగాయని వినైతా శివకుమార్‌తో గత కొంతకాలంగా ప్రేమలో ఉన్న విషయం కూడా బహిర్గతమైంది. ఈమెనే వివాహం చేసుకోతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. అయితే, వీరిద్దరి వివాహంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.


వినైత శివకుమార్ - ప్రేమ్‌జీ

శ్రీవారి సేవలో సుందరం మాస్టర్


సుందరం మాస్టర్ - ప్రభుదేవా

తిరుమల, జనవరి7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. డాన్స్ మాస్టర్లు సుందరం, ప్రభుదేవాకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

విజయకాంత్ మృతికి సంతాపంగా మౌన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు

పెరంబూర్, జనవరి 7: డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ మృతికి సంతాపంగా మదురై డీఎండీకే ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మౌన ర్యాలీ జరిగింది. మదురై యూసీ పాఠశాల ప్రాంగణం నుంచి చేపట్టిన ఈ ర్యాలీలో తొలుత విజయకాంత్ చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శులు మణికంఠన్, బాలన్, అళగర్‌స్వామి సహా పలువురు నేతలు నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా మౌన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మేయర్ ఇంద్రాణి పొన్‌వసంత్ (డీఎంకే), మాజీ మంత్రి ఉదయకుమార్ (అన్నాడీఎంకే), డిప్యూటీ మేయర్ నాగరాజన్ (సీపీఎం) దక్షిణ భారత ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడు తిరుమారన్ సహా పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

రక్తదానంలో రికార్డు సృష్టిద్దాం

● వాసవి క్లబ్‌లకు జిల్లా గవర్నర్ రష్మి ఓలేటి పిలుపు


నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్యారీస్, జనవరి 7: రక్తదానంలో రికార్డు సృష్టిద్దామని వాసవి క్లబ్‌లకు వి502ఏ జిల్లా గవర్నర్ రష్మి ఓలేటి పిలుపునిచ్చారు. షావుకారుపేట నారాయణ మొదలివీధిలోని కేఆర్‌సీవైడీఎస్ హాలులో ఆదివారం వాసవి క్లబ్ షావుకారుపేట చెన్నై, వనిత క్లబ్‌ల 2024 నూతన నిర్వాహకుల ప్రమాణస్వీకారం రష్మి ఓలేటి, రీజియన్ చైర్‌పర్సన్ ముంజులూరు మురళీమోహన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ రెండు క్లబ్‌ల అధ్యక్షులుగా చీమకుర్తి మల్లికార్జునరావు, నాగలక్ష్మి, కార్యదర్శులుగా డి.త్రిలోక్‌బాబు, పూర్ణిమ, ట్రెజరర్లుగా కె.ప్రవీణ్‌కుమార్, శివరంజని దంపతులు ప్రమాణస్వీకారం చేసి తమ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం గోపూజ, లలిత సహస్రనామం, వాసవి మాతకు ప్రత్యేక పూజలతో ప్రారంభమైంది. ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ సహకారంతో ఈ ఏడాది అన్ని సేవా కార్యక్రమాలను విజయవంతంగా జరిపించడంతో పాటు కేసీడీఎఫ్‌లను ప్రమోట్ చేసి రోలింగ్ షీల్డ్‌ను సభ్యుల ఆదరణతో అందుకుంటామని మల్లికార్జునరావు చెప్పారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో స్టార్టప్ టీఎన్ పెవిలియన్

అడయార్, జనవరి 7: స్థానిక నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటరులో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో స్టార్టప్ టీఎన్ పెవిలియన్‌ను ఏర్పాటు చేశారు. 23 విభిన్న రంగాలకు చెందిన 41 పెవిలియన్ల ఏర్పాటుచేయగా, ఇందులో ఇది ఒకటి. ఇందులో పూర్తిగా మహిళల ఆధ్వర్యంలో నడిచే స్టార్టప్ పెవిలియన్లు ఉన్నాయి. తమిళనాడు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఇన్వెస్టర్స్ సదస్సు జరుగుతోంది. స్టార్టప్‌లు, పెట్టుబడిదారుల మధ్య సంబంధాలను మరింత సులభతరం చేయడానికి ఇది ఎంతగానో దోహదపడనుంది. అలాగే, వ్యూహాత్మక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో బిజినెస్ టు బిజినెస్ సమావేశాలను నిర్వహించేలా ఏర్పాటు చేశారు.

స్టార్టప్ టీఎన్ పెవిలియన్‌లో నిర్వాహకులు, సందర్శకులు



నేడు రవాణా కార్మిక సంఘాలతో చర్చలు

● మంత్రి శివశంకర్

ప్యారీస్, జనవరి 7: ప్రభుత్వ రవాణా కార్మిక సంఘాల ప్రతినిధులతో సోమవారం వారి సమస్యలపై చర్చించనున్నట్లు రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. ప్రభుత్వ రవాణా శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ప్రకటించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, వేతనం పెంపు తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రవాణా కార్మిక సంఘాల తరపున రాష్ట్రప్రభుత్వానికి గతంలో అందజేసిన వినతిపత్రాలపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఈనెల 9 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు కార్మిక సంఘాలు నోటీసు జారీచేశాయి. సమస్యలకు పరిష్కారం కలిగే వరకు సమ్మెలో కొనసాగనున్నట్లు ఆ సంఘాలు తేల్చిచెప్పాయి. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు రవాణా కార్మిక సంఘాల ప్రతినిధులతో ఆదివారం చర్చలు జరుపుతారని మంత్రి శివశంకర్ ప్రకటించారు. అయితే, వివిధ కారణాలు, వర్షాల కారణంగా చర్చలను సోమవారానికి వాయిదా వేసినట్లు మంత్రి తెలిపారు.

వలల్లో ఎగిరే చేపలు

● సముద్రంలోకి వదిలేస్తున్న జాలర్లు



పెరంబూర్, జనవరి 7: రామనాథపురం సముద్రతీరాల్లో వలలో చిక్కిన అరుదైన ఎగిరే గార్నార్డ్ చేపలను జాలర్లు మళ్లీ సముద్రంలోకి వదిలి పెడుతున్నారు. 'ఫ్లయింగ్ గర్నార్డ్ ఫిష్' అనే రకానికి చెందిన ఎగిరే చేపలు పసిఫిక్, అట్లాంటిక్, అర్కిటిక్, హిందూమహా సముద్రాల్లో సంచరిస్తుంటాయి. గోధుమ, ఆకుపచ్చ, పసులు, ఎరుపు రంగుల్లో ఈ చేపలుంటాయి. ఈ చేపలకున్న రెక్కలు పక్షుల రెక్కలంత పెద్దవిగా ఉంటాయి. రెక్కలతో సముద్రపు ఉపరితలంపై వచ్చి కొన్ని మీటర్ల దూరం ఎగురుతుంటాయి. నీటిలోకి వెళ్లిన వెంటనే రెక్కలు కుచించుకుపోతాయి. వేటాడేందుకు, ఇతర జీవుల నుంచి రక్షించుకొనేందుకు ఈ రెక్కలు ఉపయోగపడుతుంటాయి. ప్రస్తుతం మన్నార్ సముద్రతీరాల్లో సంచరిస్తున్న ఈ చేపలు, అప్పుడప్పుడూ వలల్లో చిక్కుతుంటాయని, వాటిని మళ్లీ సముద్రంలోకి వదిలిపెడుతుంటామని రామనాథపురం జాలర్లు తెలిపారు.

పాంబన్ వంతెన దాటిన కోస్ట్‌గార్డ్ నౌక

పెరంబూర్, జనవరి 7: భారత కోస్ట్‌గార్డ్‌కు చెందిన మరమ్మతులకు గురైన నౌక 12 రోజుల అనంతరం రామేశ్వరం సమీపంలోని పాంబన్ రైలు వంతెన దాటి వెళ్లింది. కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో తయారుచేసిన భారత కోస్ట్‌గార్డ్ నౌక ఆంధ్ర రాష్ట్రం విశాఖపట్టణంలోని కోస్ట్‌గార్డ్ శిబిరానికి గత నెల 24న పాంబన్ రైలు వంతెన దాటే సమయంలో దిశ మారి బండరాయిని ఢీకొనడంతో ఇంజన్‌లోని ప్రొపెల్లర్ దెబ్బతినింది. నౌక నడపలేని పరిస్థితుల్లో దాన్ని పాంబన్ తీరప్రాంతానికి తీసుకొచ్చి మరమ్మతులు పూర్తిచేశారు. దీంతో, శనివారం మధ్యాహ్నం నౌక పాంబన్ వంతెన మీదుగా విశాఖపట్టణం బయల్దేరి వెళ్లింది. అదే సమయంలో కేరళకు చెందిన 60 ఫైబర్ పడవలు కూడా నాగపట్టినం సముద్రతీరంలో చేపలు పట్టుకొనేందుకు వరుసగా పాంబన్ రైలు వంతెన దాటి వెళ్లాయి. వంతెన రెండుగా విడిపోయి, పడవలు వెళ్లే దృశ్యాలను పర్యాటకులు ఆసక్తిగా వీక్షించారు.


పాంబన్ రైలు వంతెన దాటి వరుసగా వెళ్తున్న పడవలు

మెట్రో రైలు ప్రయాణికులకు 'వాట్సప్' డిజిటల్ టిక్కెట్లు

పెరంబూర్, జనవరి 7: మెట్రోరైలు ప్రయాణికులు 'వాట్సప్' ద్వారా డిజిటల్ టిక్కెట్లు పొందే సౌకర్యాన్ని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ పరిచయం చేసింది. నగరంలో ప్రస్తుతం 54 కి.మీ మేర మెట్రోరైలు సేవలు అందుబాటులో ఉండగా, ప్రతిరోజు 2.60 లక్షల నుంచి 3 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతమున్న 41 రైల్వేస్టేషన్లలో పేపర్, సీజన్ కార్డు, క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రయాణికులు టిక్కెట్లు పొందే వసతి కల్పించారు. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారి మాట్లాడుతూ... మెట్రోరైళ్లలో 60 శాతం మంది సీజన్ టిక్కెట్లు, 20 శాతం క్యూ ఆర్ కోడ్ ద్వారా టిక్కెట్లు పొందుతుండగా, 20 శాతం మంది కౌంటర్లలో కాగితపు టిక్కెట్లు పొందుతున్నారని తెలిపారు.



వాట్సప్ ద్వారా టిక్కెట్లు పొందుతున్న ప్రయాణికురాలు

పేపర్ టిక్కెట్ల వినియోగం తగ్గించేలా 'వాట్సప్'లో డిజిటల్ టిక్కెట్లు పొందే సౌకర్యం కల్పించామన్నారు. ప్రయాణికుల సెల్‌ఫోన్ వాట్సప్ నెంబరు నమోదుచేసి, క్యూ ఆర్ కోడ్ పంపుతామన్నారు. వారు స్టేషన్ ప్రవేశద్వారంలో ప్రవేశించిన వెంటనే అక్కడి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి డిజిటల్ టిక్కెట్లు పొందవచ్చని తెలిపారు.

మెట్రో రైల్వేస్టేషన్లలో అదనపు ఎస్కలేటరు, లిఫ్టులు

మెట్రో రైల్వే స్టేషన్‌లో అదనంగా 40 ఎస్కలేటర్లు, 10 లిఫ్టులు ఏర్పాటు కానున్నాయి. ప్రయాణకులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు చేపట్టినట్టు సీఎంఆర్ఎల్ తెలిపింది. ఇందులో భాగంగా, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న ఎగ్మూర్, తిరుమంగళం, అన్నానార్, ఆలందూర్, కోయంబేడు, డీఎంఎస్, థౌజండ్ లైట్స్ తదితర 10 రైల్వేస్టేషన్లలో అదనపు ఎస్కలేటరు, లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, రైల్వేస్టేషన్ల నుంచి నివాస ప్రాంతాలు, ప్రైవేటు కార్యాలయాలు, బస్టాండ్ తదితర ప్రాంతాలకు ప్రజలు, ఉద్యోగులు వెళ్లేలా ఐదుగురు, ఎనిమిది మందితో కూడిన బ్యాటరీ వాహనాలు నడపనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

అలరించిన అన్నమయ్య అఖండ సంకీర్తనం

ప్యారీస్, జనవరి 7: నగరంలోని 'సుశృతి' ఆధ్యాత్మిక సంగీత బృందం ఆదివారం నిర్వహించిన అన్నమయ్య అఖండ సంకీర్తనం శ్రోతలను అలరించింది. ఆళ్వార్‌పేటలోని ఎతిరాజ కల్యాణ మండపంలో దశావతరాలు, గోదాదేవి ప్రతిమలతో ఏర్పాటుచేసిన వేదికపై ఈ కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు లక్ష్మి అష్టోత్తరం, విష్ణు సహస్రనామ పారాయణం, తిరుప్పావై, ముకుంద మాల అనంతరం ఉదయం 6 గంటలకు ప్రేమ ఉపేంద్ర అఖండ జ్యోతి ప్రజ్వలనతో ఈ సంగీతోత్సవాన్ని ప్రారంభించారు. అటు పిమ్మట సుశృత వ్యవస్థాపకులు దివంగత పి.ఉపేంద్ర గుప్త చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు అద్దేపల్లి బాలాజి నేతృత్వంలో నిర్వాహకులు, సభ్యులు, అతిథులు నివాళి అర్పించారు. ఉదయం 6.30 నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ అఖండ గానంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన గానామృతం సహా 60కి పైగా కళాకారుల బృందాలు పాల్గొని అన్నమాచార్య కీర్తనలు శ్రావ్యంగా ఆలపించి శ్రోతలను అలరించారు. అలాగే, వీణ, వయొలిన్, మాండలిన్, కీబోర్డు, భరతనాట్యం తదితర కార్యక్రమాలతో కళాకారులు అన్నమయ్యకు నీరాజనం పలికారు.


అఖండ గానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు, అతిథులు


చెన్నై, ట్రేడ్ సెంటర్‌లో సీఎం స్టాలిన్‌ను కలుసుకుని తుఫాను బాధితుల సహాయార్థం రూ. 5 కోట్ల విరాళాన్ని అందజేస్తున్న గోద్రెజ్ సంస్థ అధ్యక్షురాలు నిసబా గోద్రెజ్